# రామ్‌లాల్, విఠ్ఠల్

మల్లాది వెంకట కృష్ణమూర్తి



ఆఫీసునించి ఇంటికి వచ్చే సమయంలో ఆకాశంలో దట్టంగా మబ్బులు పట్టడం గమనించాను. కూరల మార్కెట్‌కి వెళ్ళాలనుకున్న నేను వర్షానికి జంకి సరాసరి ఇంటికి వచ్చేసాను. కాఫీ ఇచ్చాక, మా ఆవిడతో కూరలు ఎందుకు తీసుకురాలేదో చెప్పాను.

‘‘బంగాళాఖాతంలో వాయుగుండ మట. ఇవాళ, రేపూ వర్షం పడుతుం దని టీ.వి.లో చెప్పారు. అన్నట్లు మీ నాగమణి ఫోన్ చేసిందండి’’ మా ఆవిడ చెప్పింది.

‘‘ఏమిటి విశేషం?’’

‘‘మిత్రబృందంతో కలిసి ఇవాళ చెన్నైకి వెళ్ళే రైలు ఎక్కుతోందిట. తీర్థయాత్రలకిట.’’

# కథ

''రైలు మన ఊరి మీంచేగా వెళ్ళేది. మన సూట్‌కేసుని తెమ్మని చెప్పకపోయావా? స్టేషన్‌కి వెళ్ళి తీసుకోవచ్చు.''

''అది చెప్పడానికే ఫోన్ చేసింది. రేపు ఉదయం ఏడున్నరకి రైలు మన ఖమ్మం స్టేషన్‌కి వస్తుంది. మిమ్మల్ని తప్పకుండా వచ్చి తీసుకోమంది.''

'' ఏ రైలు? కంపార్ట్‌మెంట్ నంబరు....''

''అన్నీ రాసుకున్నాను. నలుగురికి ఇడ్లీ, పెసరట్‌లు తీసుకు రమ్మంది.''

''రేపు హోటల్‌లో కొని తీసుకెళ్లి ఇద్దాంలే.'' చెప్పాను.

నా పిన్నమ్మ కూతురు నాగమణి భర్త గోండియా రైల్వేలో పని చేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం నాగమణి న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్‌లో ఉన్న తన కొడుకు దగ్గరకి వెళ్లేప్పుడు మేం అమెరికాలో కొన్న అమెరికన్ టూరిస్టర్ సూట్‌కేసుని తీసుకెళ్లింది. నెల క్రితమే తిరిగి వచ్చింది.

మర్నాడు ఉదయం ఆరుకి సెల్‌ఫోన్ అలారం మోగితే నాకు మెలకువ వచ్చింది. బయట వర్షం పడే శబ్దం వినిపిస్తోంది. లేచి ముందు తలుపు తెరచి చూసాను. వర్షం రాత్రి నించి కురుస్తున్నట్లుంది. రోడ్డు ఉండాల్సిన చోట కాలువ కనిపించింది. నీరు వేగంగా ప్రవహిస్తోంది. స్కూటర్‌ని తీస్తే ఆ నీళ్ళల్లో రైల్వేస్టేషన్‌కి చేరుకోకుండా అది మధ్యలో ఎక్కడో ఆగిపోతుంది. ఎలా వెళ్లాలో పాలుపోలేదు. నిస్సహాయంగా చూసాను.

''నేను రాను. పోనీ గొడుగేసుకుని నడిచి వెళ్తారా?'' అడిగింది మా ఆవిడ.

''డ్రైనేజీ మూతలు తెరచి ఉంటే ప్రమాదం.'' నిరాకరించాను.

''నాగమణి ఆ పెద్ద సూట్‌కేస్‌ని తన వెంట ఆ యాత్రల్లో తిప్పాల్సిందేనన్నమాట.'' మా ఆవిడ కొద్దిగా బాధపడింది.

ఏడుకి స్టేషన్‌కి ఫోన్ చేస్తే ఆ రైలు టైముకే వస్తుందని తెలిసింది. ఎనిమిదికి నా సెల్ ఫోన్ మోగింది. నాగమణి కంఠం వినబడింది.

''రాలేదేంరా? మీ ఆవిడ చెప్పలేదా?'' నిష్ఠూరంగా అడిగింది.

సమస్యని వివరించాను.

''నాతో నాగ్‌పూర్‌లో ఎక్కి ఖమ్మంలో ఓ పెద్దాయన దిగాడు. నువ్వు రాకపోవడంతో నీకిస్తానంటే నీ ఫోన్ నంబరు, అడ్రసు ఇచ్చి ఆ సూట్‌కేసుని ఆయనికిచ్చాను.''

''అరెరె! అతనెలాంటివాడో?''

''పెద్ద మనిషిలానే ఉన్నాడు. అతనికి ఇవ్వడం తప్ప నాకు వేరే గత్యంతరం లేకపోయింది. నెల రోజులు యాత్రల్లో దాన్ని నా వెంట ఎలా తిప్పగలను?''

''అదీ నిజమే.''

''అది అందగానే నాకు ఫోన్ చేసి చెప్పు.



అతను తన వ్యాపారం పని మీద ఖమ్మంలో దిగాడు. అది చూసుకుని ఇవాళ సాయంత్రమే మళ్ళీ అతను విజయవాడ వెళ్ళిపోతాట్ట. అతని సెల్ నంబర్ ఇచ్చాడు. రాసుకో...''

''అలాగే''

''ఏ సమాజంలోనైనా తక్కువ మంది దొంగలు ఉంటే దొంగతనం చేయడానికి మనుషులు జంకుతారు. ఎక్కువ మంది దొంగలు ఉంటే దొంగతనం చేయడానికి జంకరు. అందుకని నేను ఎన్నటికీ దొంగగా ఉండదలచుకోలేదు.'' అని ఆయన అన్నాడ్రా! అందుకని నమ్మి ఇచ్చాను.''

అది రాసుకున్నాక లైన్ కట్ చేసి, అతని సెల్‌కు చేసాను కానీ 'ఎయిదర్ స్విచ్డ్ ఆఫ్ ఆర్ అవుటాఫ్ కాలింగ్ ఏరియా' అని జవాబొచ్చింది. కోపంగా మా ఆవిడతో చెప్పాను.

''ఇంక మనం ఆ సూట్‌కేసు మీద ఆశ వదిలేసుకోవచ్చు.''

''ఏమైంది?''

జరిగింది చెప్పాను.

పదిన్నరైనా వర్షం తగ్గలేదు. నేను ఆఫీసుకి వెళ్ళలేదు. పన్నెండున్నర లోగా ఆ నంబర్‌కి ఎన్నిసార్లు ఫోన్ చేసినా అదే జవాబు. ఇద్దరం నాగమణిని తిట్టుకున్నాం.

మూడున్నరకి తలుపు కొట్టిన చప్పుడైంది. ఇంత వర్షంలో కూడా పని మనిషి వచ్చిందా? అనుకుంటూ నేను తలుపు తెరిస్తే ఎదురుగా ఓ ముసలాయన నిల్చుని ఉన్నాడు. తెల్లటి పంచె, పొడుగు చేతుల చొక్కా, నెత్తిన తెల్లటి టోపి చూడగానే ఉత్తరాది వాడని తెలిసిపోతుంది. అతని కుడిచేతిలో ఓ ఎయిర్ బ్యాగ్, ఎడం చేతిలో మా అమెరికన్ టూరిస్టర్‌లు కనిపించాయి.

''మీరు నాగరాజేనా?'' హిందీలో అడిగాడు.

అతనెవరో అర్థం అవడంతో తల ఊపి లోపలికి రమ్మన్నాను. ఆయన లోపలికి వచ్చి మా సూట్‌కేసుని నేల మీద ఉంచి చెప్పాడు.

''నాగమణి మీకు ఫోన్ చేసి విషయం చెప్పి ఉంటుంది. వెళ్తాను.'' జుట్టునించి కంటికి అడ్డంగా కారే నీటిని తుడుచుకుంటూ చెప్పాడు.

''టీ తీసుకుని వెళ్ళండి.''

''రైలుకి టైమైంది. విజయవాడ వెళ్ళాలి.''

''మీకు ఫోన్‌చేస్తే స్విచాఫ్ అని వచ్చింది.'' మా ఆవిడ ఆయనతో చెప్పింది.

'నా సెల్ ఫోన్‌కి చార్జి అయిపోయింది. మా కంపార్ట్‌మెంట్‌లోని ఏ ప్లగ్గూ పని చేయలేదు.''

''ఇంత వర్షంలో మీరు వస్తారనుకోలేదు. మా కోసం చాలా శ్రమ పడ్డారు.'' నొచ్చుకుంటూ చెప్పాను.

వెనక్కి తిరిగి రెండడుగులు వేసిన ఆయన నా మాటలకి చటుక్కున ఆగాడు. నా భుజం మీద చేతులు వేసి, నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ చెప్పాడు.

''ఇక్కడ ఇంత వర్షం అని తెలిస్తే నేనసలు ఈ సూట్‌కేసుని తీసుకునే వాడిని కాను. నాకో ఆదర్శం ఉంది. ప్రపంచంలో మనకి తారసపడే ఇతరుల ప్రవర్తన నించే మనం చాలా నేర్చుకుంటాం. వారిలో నిజాయితీ ఉంటే మనం కూడా దాన్నే నేర్చుకుని ఆచరిస్తాం. అన్ని మంచి గుణాలకి నేను పెట్టుకున్న పేరు నిజాయితీ. వారిలో అది లేకపోతే మనమూ నిజాయితీకి వ్యతిరేక ప్రవర్తనని నేర్చుకుని దాన్నే ఆచరిస్తాం. నా వంతుగా నేను సమాజానికి నా ప్రవర్తనతో నిజాయితీనే నేర్పదలచుకున్నాను. సూట్‌కేసుకి ఆశ పడో, వానకి జడిసో నేను మీ దగ్గరకి రాకపోతే దొంగతనం లేదా మాట తప్పటం అనే ప్రవర్తనని మీకు నేర్పినట్లవుతుంది. వర్షం పడ్డా, బురద రోడ్లలో తడుస్తూ రావాల్సి వచ్చినా, అడ్రసు చెప్పే మనుషులు రోడ్డు మీద లేకపోయినా నేను మీకు నిజాయితీగా ఉండాలన్న పాఠాన్ని నేర్పాలన్న తపనే నన్ను మీ ఇంటి గుమ్మం ముందుకు తీసుకువచ్చింది. అప్పుడప్పుడూ ఇలాంటి సందర్భాల్లో కూడా నేను నా ప్రవర్తనని మార్చుకోక కష్టపడుతుంటాను. అందువల్ల నా దగ్గరి వాళ్ళు నన్ను 'రామ్‌లాల్, ది ఫూల్' అంటుంటారు. నిజాయితీగా ఉండే వాళ్ళని, నిజాయితీని నేర్పే వాళ్ళని ప్రపంచం అలాగే అంటుంది. 'రామలాల్, ది థీఫ్' అని అనంతకాలం ఏమైనా అననీండి.''

ఆయన మాటలకి మేం నిశ్చేష్టులమయ్యాం. మేం తేరుకునే సరికే ఆయన మోకాళ్ళ లోతు నీళ్లలో శ్రమతో కూడిన అడుగులు వేస్తూ వెళ్లిపోయాడు.



''యాత్రలో నాగమణికి మన సూట్‌కేసు పెద్ద భారం అని తెలిసీ, నాగమణికి మాట ఇచ్చినట్లుగా మనం స్టేషన్‌కి వెళ్ళి, సూట్‌కేసు తెచ్చుకోవడానికి మనకి వర్షం అడ్డొచ్చింది. పాపం! రామ్‌లాల్ మాత్రం నాగమణి బాధని గమనించి, తనకి ఏ సంబంధం లేని దాన్ని మోసుకుని వెతుక్కుంటూ మనింటికి వచ్చి ఇచ్చి వెళ్లాడు. ఆయన కాదు. నిజానికి మనిద్దరం ఫూల్స్, స్కౌండ్రల్స్'' నా భార్య అన్న మాటలు నాకు వినబడ్డాయి.

నాగమణి ఇందాక చెప్పిన మాటలు కూడా గుర్తుకు వచ్చాయి.

''ఏ సమాజంలోనైనా తక్కువ మంది దొంగలు ఉంటే, దొంగతనం చేయడానికి మనుషులు జంకుతారు. ఎక్కువ మంది దొంగలు ఉంటే దొంగతనం చేయడానికి జంకరు. అందుకని నేను ఎన్నటికీ దొంగగా ఉండదలచుకోలేదు.' అని ఆయన అన్నాడ్రా.''

*